తుంగతుర్తిలో బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

కృష్ణా జలాల కోసం మరో పోరాటానికి సిద్ధం

కాంగ్రెస్‌కు చేతకాకే ప్రాజెక్టుల అప్పగింత: మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

తుంగతుర్తి, ఫిబ్రవరి 7 : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను ప్రజలు గమనిస్తున్నారని, కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడం ఆ పార్టీ చేతగాని తనమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. కృష్ణా జలాలపై కేంద్రం పెత్తనంతో ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి, పాలమూరు జిల్లాల్లో సాగు, తాగునీటి కోసం కేంద్రం అనుమతి కోసం ఎదురుచూడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం కృష్ణా జలాలపై మరో పోరాటానికి బీఆర్ఎస్ సిద్ధమవుతున్నదని తెలిపారు. బుధవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అధ్యక్షతన బీఆర్ఎస్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆంధ్రా-తెలంగాణ రాష్ట్రాల కృష్ణా జలాల ట్రిబ్యునల్ వివాదం ప్రధాని మోదీ తీర్చడానికి 9 ఏండ్లకుపైగా పట్టిందని అన్నారు. నాడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండి కృష్ణా జలాల సమస్యను ఆంధ్రా-తెలంగాణ రాష్ట్రాలు తీర్చుకుంటాయని, కేంద్రం తలదూర్చవద్దని కరాఖండిగా చెప్పి పోరాడిన విషయాన్ని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం పని తీరు తేటతెల్లం అయ్యిందని విమర్శించారు. సాగునీటి విషయంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించక పోవడం జిల్లా ప్రజలకు అన్యాయం చేసినట్లేనని చెప్పారు. సమావేశంలో జడ్పీ చైర్మన్లు గుజ్జ దీపికాయుగంధర్‌రావు, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, రాజకీయ విశ్లేషకుడు ఒంటెద్దు నరసింహారెడ్డి, బీఆర్ఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లా బీర్కూర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

ముఖ్యమంత్రీ.. దిగజారి మాట్లాడొద్దు

- హుందాగా వ్యవహరించాలి
- మాజీ స్పీకర్ పోచారం హితవు

బాన్సువాడ, ఫిబ్రవరి 7: ముఖ్యమంత్రి హోదాలో ఉండి దిగజారుడు మాటలు మాట్లాడటం సరికాదని రేవంత్‌రెడ్డికి మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి హితవు పలికారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పట్టుకుని సీఎం రేవంత్‌రెడ్డి నోటి కొచ్చినట్టు దుర్భాషలాడటం ఏమిటని ప్రశ్నించారు. సీఎం పదవిలో హూందాగా వ్యవహరించాలని సూచించారు. ప్రతిపక్షాల మీద కాకుండా ప్రజలకు ఇచ్చిన హామీల మీద దృష్టి పెట్టాలని సూచించారు. కాంగ్రెస్ 420 హామీలను అమలు చేయాలని, లేకపోతే ప్రజల తరపున బీఆర్ఎస్ పోరాడుతుందని తెలిపారు. కామారెడ్డి జిల్లా బీర్కూర్‌లో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో పోచారం మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో 1.8 శాతం ఓట్ల తేడాతోనే అధికారం కోల్పోయామని, 14 స్థానాల్లో స్వల్ప మెజార్టీతో ఓడిపోయినట్టు తెలిపారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

60 రోజులు..4 మోసాలు

- బట్టేబాజ్ కాంగ్రెస్ వెన్నుపోటు
- అబద్ధాలు చెప్పి పవర్‌లోకొచ్చింది
- సీఎం రేవంత్‌వి ఝూటా మాటలు
- బీఆర్ఎస్ జనగామ నియోజకవర్గ స్థాయి సమావేశంలో హరీశ్ ఫైర్

బీఆర్ఎస్ జనగామ నియోజకవర్గస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి తదితరులు

జనగామ, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన బట్టేబాజ్ కాంగ్రెస్.. 60 రోజుల్లోనే రైతాంగానికి 4 మోసాలు చేసి వెన్నుపోటు పొడిచిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ మోసాలు, సీఎం రేవంత్‌రెడ్డి నిజ స్వరూపంపై ప్రజల్లో చర్చకు పెట్టాలని ఆయన బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం జనగామలో ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లుతో కలిసి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు.. ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన నాలుగు హామీలైన రూ.2 లక్షల రుణ మాఫీ, 24 గంటల నాణ్యమైన కరెంటు, రూ.15 వేల రైతు భరోసా, ధాన్యానికి రూ.500 బోనస్, రూ.4 వేలకు పింఛన్ల పెంపుపై చేసిన ప్రకటనల వీడియో క్లిప్‌లను స్క్రీన్లపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు చూపించారు. అనంతరం మాట్లాడుతూ.. ఝూటా మాటలతో సీఎం రేవంత్‌రెడ్డి కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. ప్రియాంక గాంధీ సమక్షంలో రేవంత్‌రెడ్డి నిరుద్యోగ భృతి హామీ ఇస్తే.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాత్రం అసెంబ్లీ సాక్షిగా హామీ ఇవ్వలేదని అబద్ధాలు చెప్పిన అంశాన్ని హరీశ్‌రావు వీడియో క్లిప్‌లో చూపించారు.

ఇక 40 రోజుల గడువే..

100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంకా 40 రోజుల గడువే మిగిలి ఉందని, చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ ఎన్నికల కోడ్ కంటే ముందే జీవోలు విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ప్రజలకు చెప్పిన మాటలు, రైతులకు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తున్న బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని, అడిగిన ప్రజలను మంత్రులు, ఎమ్మెల్యేలు దబాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ కంటే ముందు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం తాగేందుకు మంచినీళ్లు ఇచ్చిందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో కరువుతో వలసలు పోతే.. తెలంగాణ వచ్చిన తర్వాత వలసలు వాపస్ వచ్చేలా చేసిన ఘనత కేసీఆర్‌దే అని స్పష్టం చేశారు. కరోనా కష్టకాలంలో 45 రోజుల లాక్‌డౌన్‌లో రూపాయి ఆదాయం లేకున్నా అన్ని బిల్లులు ఆపి పంట సీజన్‌కు ముందే రైతుబంధు డబ్బులు వేశామని గుర్తుచేశారు. రైతులకు పెట్టుబడి ఆపి ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు వేశామని చెప్తున్న కాంగ్రెస్ సర్కార్.. ఈ నెల 7వ తారీఖు గడుస్తున్నా ఇంకా జీతాలు రాలేదని, రైతు భరోసా 3 ఎకరాల వరకే వేశారని విమర్శించారు. క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్, మహిళలకు గృహజ్యోతి పథకం కింద నెలకు రూ.2500, పింఛన్ రూ.4 వేలకు పెంచకుండా పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలు, రైతుల ఓట్లు ఎట్లా అడుగుతారని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ రాకముందు రాష్ట్రంలో 96 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండితే.. ఇప్పుడు 3 కోట్ల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తున్నదని, ఇదంతా ఊరికనే సాధ్యమైందా? కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేస్తున్న నాయకులు కేసీఆర్ వల్లే ఇంత దిగుబడి పెరిగిందన్న సంగతి తెలియదా? అని నిలదీశారు. తెలంగాణ రాష్ట్రం పరువు తీసేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడే భాష, రైతుబంధు అడిగితే చెప్పుతో కొట్టండి అంటూ మాట్లాడిన మంత్రి ప్రవర్తన చూస్తుంటే కాంగ్రెస్ పార్టీలో అసహనం పెరుగుతున్నదని వివరించారు. తెలంగాణలో 17 ఎంపీ సీట్లను గెలిపిస్తే రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే 6 గ్యారెంటీలు అమలవుతాయన్న సీఎం మాటలు విడ్డూరంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. గత ఎన్నికల్లో దేశం మొత్తంలో కాంగ్రెస్‌కు 47 సీట్లు వస్తే ఈసారి 40 సీట్లకు పరిమితమై కనీసం ప్రధాన ప్రతిపక్షం హోదా కూడా దక్కే పరిస్థితి లేదని చెప్పారు. కాంగ్రెస్ నాయకులకు వ్యంగ్యం తప్ప వ్యవహారం తెలవదని, ప్రగతి భవన్ కట్టిస్తే అందులో బంగారు బాత్రూంలు కట్టించుకున్నారని అబద్ధపు ప్రచారాలు చేశారని దుయ్యబట్టారు. తెలంగాణ గల్లీ సమస్యలను పార్లమెంట్ వేదికగా వాణి వినిపించేలా బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించడం ద్వారా కాంగ్రెస్ మెడలు వంచి నాయకులకు బుద్ధి చెప్పాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

మార్పు అంటే ఇదే..

బీఆర్ఎస్ జనగామ నియోజకవర్గ స్థాయి సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతుండగానే రెండు సార్లు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. మొదటిసారి 5 నిమిషాలపాటు, రెండోసారి 15 నిమిషాలపాటు కరెంటు పోయింది. జనరేటర్ సాయంతో విద్యుత్తు సరఫరా చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు.. 'మార్పు అంటే ఇదే కదా' అంటూ వ్యంగ్యంగా మాట్లాడారు. దీంతో సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు సీఎం డౌన్‌డౌన్, కాంగ్రెస్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు.

మార్పు మొదలైంది!

మొదటిపేజీ తరువాయి...

గురించి మాట్లాడుతున్న సమయంలో నే రెండుసార్లు సరఫరా నిలిచిపోయింది. తొలిసారి ఐదు నిమిషాల్లోనే వచ్చిన కరెంటు రెండోసారి పావుగంట పోయింది. జనరేటర్ సాయంతో సమావేశాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా హరీశ్ మా ట్లాడుతూ.. 'మార్పంటే ఇదే కదా' అని వ్యంగ్యంగా అనడంతో సభలో కొద్దిసేపు నవ్వులు విరిశాయి. ఆ వెంటనే కార్యకర్తలు 'కాంగ్రెస్ డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు.

మతసంబంధ విషయాలను రాజకీయం చేయొద్దు

- రాజ్యసభలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): మత సంబంధ విషయాలను రాజకీయం చేయరాదని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు కోరారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా బుధవారం రాజ్యసభలో ఆయన మాట్లాడారు. కొందరు హిందూయిజానికి తామే చాంపియన్లుగా ప్రచారం చేసుకుంటున్నారని, ఇది సరికాదని పేర్కొన్నారు. రాముడు ఎప్పటికీ తమ హృదయాల్లో ఉంటాడని, ఫిబ్రవరి 22కు ముందు కూడా రాముడిని పూజిస్తూనే ఉన్నారని, తాము నిత్యం పూజలు చేస్తామని చెప్పారు. అయినా అయోధ్యలో రామమందిర ప్రాణ ప్రతిష్ఠ పేరుతో రాముడు అప్పుడే అవతరించినట్టుగా కొందరు ప్రచారార్భాటం చేశారని ఎద్దేవా చేశారు. అంతా హిందువులే అయినప్పటికీ భిన్న సంస్కృతి, సంప్రదాయాలకు మన దేశం నిలయంగా ఉన్నదని పేర్కొన్నారు. తాము ద్రావిడులం అయినప్పటికీ ఉత్తరాదికన్నా దక్షిణాదిలోనే హైందవ ఆలయాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. వారు కోరుకుంటున్న హిందూయిజాన్ని వ్యతిరేకించే వారిని, వారికి గిట్టనివారిని యాంటీ నేషనల్స్‌గా చిత్రీకరించడం సరికాదని హితవు పలికారు. ఒకరి విశ్వాసాలను మరొకరు గౌరవించాలి తప్ప కించపరచరాదని కోరారు. అందరూ హిందువులే అయినా అందులో కొందరిని తమ పక్కన కూర్చోనివ్వరని, వారితో కలిసి భోజనం చేయరని, ముట్టుకోరని చెప్పారు. అయినా ఎటువంటి వివక్ష లేనివిధంగా అందరూ సమానమే అని రాజ్యాంగంలో పొందుపరిచారని గుర్తుచేశారు.

రాష్ట్రానికి కాంగ్రెస్ తీవ్ర అన్యాయం

- ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా కేసీఆర్ తెలంగాణ ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించలేదు
- కందుకూరులో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి ఆగ్రహం

కందుకూరు, ఫిబ్రవరి 7: కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడం ద్వారా రాష్ట్రానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. అయినా, సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. కృష్ణా నదీ జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకోవడానికి ఎందుకు ఆయన ప్రయత్నించడం లేదని నిలదీశారు. బుధవారం రంగారెడ్డి జిల్లా కందుకూరులో ఆమె మాట్లాడుతూ.. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా కేసీఆర్ ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించలేదని, పదేండ్లు కాపాడారని గుర్తుచేశారు. కృష్ణా ప్రాజెక్టులను కేఈఆర్ఎంబీకి అప్పగించాలని నిర్ణయించిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తే సహించబోమని, రాష్ట్ర ప్రభుత్వ ప్రమాదకర ధోరణిని ప్రజాక్షేత్రంలో ఎండగడుతామని హెచ్చరించారు. తెలంగాణ నీటి హక్కులు తేలే వరకు ఉద్యమాన్ని వదిలిపెట్టబోమని ఆమె స్పష్టం చేశారు. కందుకూరుకు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ కాలేజీని ఉపసంహరించుకోవడం తగదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మెడికల్ కళాశాల రద్దు జీవోను ఉపసంహరించుకోవాలని కోరారు. సమావేశంలో జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనంపల్లి రాజకీయ జీవితానికి ఫుల్‌స్టాప్!

బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు అశోక్‌గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు రాజకీయ జీవితం ముగిసిందని, అందుకే మతిస్థిమితం కోల్పోయి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు అశోక్‌గౌడ్ ఒక ప్రకటనలో మండిపడ్డారు. మతిస్థిమితం బాగోలేనప్పుడు ఇంట్లో కూర్చుంటే బాగుంటుందని హితవు పలికారు. అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి ప్రజలు ఓడించినా మైనంపల్లికి బుద్ధి రాలేదని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలోనూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుపై వ్యక్తిగత విమర్శలు చేశారని, ఫలితం ఎన్నికల్లో కనిపించిందని తెలిపారు. నిర్మాణాత్మక విమర్శలు చేయాలని, వీధి రౌడీలా మాట్లాడటం సరికాదని సూచించారు. అధికార పార్టీ నేతగా బాధ్యతతో వ్యవహరిస్తే మంచిదని, లేదంటే ప్రజలు సహించరని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీకి ఇది స్పీడ్‌బ్రేకర్ మాత్రమేనని, తెలంగాణవాదులమంతా కేసీఆర్ వెంటే ఉన్నామని, తమ నేతల జోలికొస్తే ఊరుకునే ప్రసక్తే లేదని తెలిపారు.

ట్రాన్స్‌జెండర్ల హక్కులను కాపాడాలి

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ

హైదరాబాద్, ఫిబ్రవరి 7, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ కార్యాలయాలు, కార్పొరేట్ సంస్థల్లో ట్రాన్స్‌జెండర్ల హక్కుల రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శామ్‌కోషి ఆదేశించారు. ట్రాన్స్‌జెండర్ల సమస్యలపై అవగాహన కల్పించేందుకు న్యాయ సేవాధికార సంస్థ ప్రభుత్వాధికారులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులతో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఈ సందర్భంగా జస్టిస్ శామ్‌కోషి మాట్లాడుతూ, ట్రాన్స్‌జెండర్లకు ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు కల్పించాలని, దుస్తుల మార్పిడికి ప్రత్యేక వసతులు కల్పించాలని, వారికోసం ప్రత్యేక షెల్టర్ హోమ్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాన్స్‌జెండర్లతో అనుచితంగా వ్యవహరిస్తే అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

60 సరే.. 2 లక్షల ఉద్యోగాల సంగతేంది?

- ఏ శాఖలో ఎన్ని ఖాళీలో చెప్పండి
- మల్టీ జోనల్, జోనల్ సిస్టం మార్చొద్దు
- బీఆర్ఎస్ నేత బీ వినోద్‌కుమార్

బుధవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్. బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, జడ్పీ మాజీ చైర్పర్సన్ ఉమ

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1లో 60 ఉద్యోగాల భర్తీకి జీవో ఇవ్వడం బాగానే ఉన్నదని, మిగిలిన 1,99,940 ఉద్యోగాల సంగతేంటని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్ ప్రశ్నించారు. బుధవారం తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, జడ్పీ మాజీ చైర్మన్ తుల ఉమతో కలిసి మీడియా సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ఏ శాఖలో ఎన్ని ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయో ఈ నెలాఖరులోగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఖాళీల భర్తీకి డిసెంబర్ వరకు వేచి చూస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో 1,60,083 ఉద్యోగాలను భర్తీ చేశారని, 42,652 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు కూడా నిర్వహించారని, ఫలితాలు కోసం అభ్యర్థులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పెట్టిన పేర్లను మార్చుతున్నట్టుగా మల్టీ జోనల్, జోనల్ విధానాన్ని మార్చవద్దని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా పునర్విభజన పేరుతో వీటిని మార్చితే ఉద్యోగాల భర్తీలో ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. 7 వేల నర్సుల ఉద్యోగాలను భర్తీ చేశామని సీఎం రేవంత్ చెప్పుకోవడం సరికాదని, వాటి నోటిఫికేషన్‌ను కేసీఆర్ ప్రభుత్వమే ఇచ్చిందని గుర్తు చేశారు. 15 వేల కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చివరి దశలో ఉందని, దీనిని కూడా రేవంత్ తన ఖాతాలో వేసుకోవాలనుకుంటున్నారని విమర్శించారు. పార్టీ మారినంత మాత్రాన విమర్శలు చేయాల్సిన పనిలేదని పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌ను ఉద్దేశించి వినోద్‌కుమార్ సూచించారు.

మెగా డీఎస్సీపై స్పష్టత ఇవ్వాలి

బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ మొదటి క్యాబినెట్‌లోనే మెగా డీఎస్సీపై నిర్ణయం తీసుకుంటామని రేవంత్‌రెడ్డి చెప్పారని, కానీ ఇప్పటి వరకు దాని జాడే లేదని విమర్శించారు. దీనిపై సీఎం వివరణ ఇవ్వాలని కోరారు. ఇప్పటికే విడుదలైన గ్రూప్స్, డీఎస్సీ పరీక్ష ఫలితాలు విడుదల చేయాలని, కొత్త పోస్టులకు మరో పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. కొత్త పోస్టులకు ఇప్పటికే నిర్వహించిన పరీక్షలకు ముడి పెట్టవద్దని సూచించారు.

ధర్మపురిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఈశ్వర్. చిత్రంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి

ఆరు గ్యారెంటీలపై నిలదీద్దాం

బీఆర్ఎస్ కార్యకర్తలు ఆత్మస్థైర్యం కోల్పోవద్దు: మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి, ఫిబ్రవరి 7 : కాంగ్రెస్ అబద్ధపు హామీలతో మోసపోయి గోసపడుతున్న తెలంగాణ ప్రజల పక్షాన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిలబడాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. బుధవారం జగిత్యాల జిల్లా ధర్మపురిలోని నృసింహ గార్డెన్స్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కొప్పుల మాట్లాడుతూ.. ఉద్యమనేత కేసీఆర్ పోరాట ఫలితంగానే తెలంగాణ సిద్ధించిందని చెప్పారు. వచ్చిన తెలంగాణ కేసీఆర్ పదేండ్ల పాలనలో అద్భుత ప్రగతిని సాధించిందని తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే ఘన విజయమని ధీమా వ్యక్తం చేశారు. మాజీ స్పీకర్ మధుసూదనాచారి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసిందని ఆరోపణలు చేయడం సరికాదని, పైసా అప్పు తేకుండా అభివృద్ధి ఎలా సాధ్యమో దమ్ముంటే నిరూపించాలని సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందించాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. సమావేశంలో జడ్పీ చైర్పర్సన్ దావ వసంత, డీసీఎమ్మెస్ చైర్మన్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభకు విస్తృత ఏర్పాట్లు

మొదటిపేజీ తరువాయి...

నిర్వహించాలని నిర్ణయించారు. సభా స్థలాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, మా జీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, యాదాద్రి భువనగిరి జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, పార్టీ సమన్వయకర్త రవీందర్‌సింగ్, పార్టీ నేత చెరుకు సుధాకర్ బుధవారం పరిశీలించారు. సభా వేదిక, గ్యాలరీలు, బారికేడింగ్, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై సమీక్షించారు. గురువారం నుంచి ఏర్పాట్లు ముమ్మరం చేయనున్నట్టు తెలిపారు. అంతకుముందు ఎస్పీ చందనాదీప్తిని కలిసి సభకు అనుమతి కోరుతూ ఓ లేఖను అందజేశారు. ఈ సభకు కృష్ణానదీ పరీవాహక ప్రాంత జిల్లాల నుంచి భారీ సంఖ్యలో రైతులు, ప్రజలను సమీకరించాలని ప్రయత్నాలు చేస్తున్నారు. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లా ప్రజలు కూడా సభకు తరలిరావాలని జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఓవైపు సభా ఏర్పాట్లపై దృష్టి సారిస్తూనే మరోవైపు నియోజకవర్గాల వారీగా విస్తృత ప్రచారం కోసం సమన్వయకర్తలను పార్టీ రంగంలోకి దింపింది.

గతంలోనూ ఇక్కడే సభ

బహిరంగ సభకు ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి ప్రజలు తరలిరానున్న నేపథ్యంలో విశాలమైన స్థలాన్ని ఎంపికచేశారు. నల్లగొండ నలువైపుల నుంచి సులువుగా సభాస్థలానికి చేరుకునే చర్యలు తీసుకొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ కేసీఆర్ హాజరైన బహిరంగ సభను ఇక్కడే నిర్వహించారు. గురువారం నుంచి సభా స్థలం చదును చేయడంతోపాటు ఏర్పాట్లను మొదలు పెట్టనున్నట్టు జగదీశ్‌రెడ్డి తెలిపారు. సభ నిర్వహణ అనుమతి కోరుతూ నల్లగొండ ఎస్పీ చందనాదీప్తిని పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్‌సింగ్ బుధవారం ఎస్పీ కార్యాలయంలో కలిసి లేఖను అందజేశారు. త్వరగా అనుమతి వ్వాలని కోరారు. ఎస్పీ చందనాదీప్తి స్పందిస్తూ నిబంధనల ప్రకారం వినతిని పరిశీలించి నిర్ణయం వెల్లడిస్తామని చెప్పారు. నేడు సభా అనుమతిపై పోలీసులు తమ నిర్ణయం ప్రకటించవచ్చని సమాచారం.

సభకు విస్తృత ఏర్పాట్లు: జగదీశ్‌రెడ్డి

చలో నల్లగొండ సభకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తెలిపారు. సభకు కృష్ణా పరీవాహక ప్రాంత ప్రజలతోపాటు రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి కూడా పెద్దఎత్తున తరలివస్తారని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు ఇప్పటికైనా జరిగిన తప్పును సరిదిద్దుకుని కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు సిద్ధం కావాలని సూచించారు. ప్రాజెక్టుల పరిరక్షణ విషయంలో రాజకీయాలను పక్కన పెట్టి రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడేందుకు అందరూ సిద్ధం కావాల్సిన అవసరం ఉన్నదని అన్నారు.